జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 25-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 82 పేజీలు: 8 వెల : రూ.7

* కొందరు పోలీస్ ఉన్నతాధికారులకు నీడన విధులు
* కలెక్షన్లే వీరి డ్యూటీ
* నిత్యం సివిల్ డ్రస్సుల్లోనే దందాలు
* కొన్నేళ్లుగా ఇదే తంతు
* పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన దాఖలాలే లేవన్న విమర్శలు

# పాస్‌పోర్టు.. పోలీస్!



**శ్రీకాకుళం క్రైం, జులై 24 (వార్త):** జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ (ఎస్‌ఈబీ) పేరిట ఒక పోలీసు టీం ఉంది. ఈ టీం సభ్యుల్లో కొందరు పాస్‌పోర్టు డ్యూటీ చేస్తుంటారు. వీరు యూనిఫారం వేసుకోరు. నిత్యం సివిల్ డ్రస్సుల్లోనే ఉంటూ కొందరు పోలీసు అధికారుల నీడన ఉంటూ కలెక్షన్లు చేస్తుంటారు. అధికారికి మాత్రం నమ్మకంగా ఉంటారు. ఆ అధికారి ఏం చెబితే అది చేయడమే వీరి విధి. సర్కారు జీతం కన్నా ఆ అధికారి ఇచ్చేదే కమీషనే అధికంగా ఉంటుంది. ఇసుక నుంచి మద్యం వరకూ వీరు కలెక్షన్లు తీసుకురావడమే వీరి పని. పాస్‌పోర్టు డ్యూటీ తమకు ఎప్పుడు పడుతుందా అని కొందరు పోలీసులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటారు. అయితే ఇటీవల కలెక్షన్లు పంపకాల్లో తేడాలు రావడంతో ఎస్‌ఈబీ బృందం మధ్య లుకలుకలు ప్రారంభమయ్యాయి. ఈ విషయం బయటకు పొక్కడంతో పాటు పత్రికల్లో కథనాలు రావడంతో ఓ పోలీసు అధికారి వారికి గట్టిగా హెచ్చరికలు కూడా చేశారట. విషయం బయటపడితే అందరం పోతామని, పోలీసు శాఖకు మచ్చ అని.. భవిష్యత్ లేకుండా చేస్తానని వార్నింగ్ కూడా ఇచ్చారట. దీంతో వారంతా సైలెంట్ అయ్యారు. ఇదే సమయంలో పాత ఎస్పీకి బదిలీ కావడం, కొత్త ఎస్పీ బాధ్యతలు తీసుకున్నారు. అయితే కొత్త ఎస్పీ స్ట్రిక్ట్‌గా ఉండడంతో కొద్ది రోజులు పాటు కలెక్షన్ల దందా జరగకుండా ఆ అధికారితో పాటు పాస్‌పోర్టు పోలీసులు సైలెంట్‌గా ఉన్నారట. అయితే ప్రస్తుతం పాస్‌పోర్టు విధుల్లో ఎవరెవరు ఉన్నారు? ఎన్నేళ్ల నుంచి ఏ అధికారి వద్ద వీరు విధులు నిర్వహిస్తున్నారు? వీరి ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయి? వీరిపై ఉన్న ఆరోపణలు, ఇటీవల స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ పోలీసు బృందం మధ్యలో ఉన్న గొడవలు, తదితర అంశాలపై జిల్లా పోలీసు బాస్ పూర్తిస్థాయిలో విచారణ చేపడితే ఈ కలెక్షన్ల పర్వం వెనుకున్న డొంక కదిలి అసలు నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



# వరదొస్తే.. వణుకే!

* రెండేళ్ల కింద వచ్చిన వరదకు వంశధార కుడి గట్టుకు కోత
* గత రెండేళ్లుగా గండిని పూడ్చని వంశధార అధికారులు
* పరిశీలనలే తప్పా... పరిష్కారం చూపని అధికార యంత్రాంగం
* ఎమ్మెల్యే దృష్టి సారించాలని కోరుతున్న నదీతీర ప్రాంతీయులు



**హిరమండలం, జులై 24 (వార్త):** వంశధారకు వరదొస్తే చాలు.. నదీ తీర ప్రాంత ప్రజలు వణుకుతున్నారు. గత రెండు సంవత్సరాల కిందట వంశధార నదికి వరదలు రావడంతో గొట్టాబ్యారేజి నుంచి సుమారు 100 మీటర్ల దూరంలో కుడి ప్రాంతంలో వరద గట్టు పూర్తిగా కోతకు గురైంది. అప్పటి జిల్లా అధికార యంత్రాంగంతో పాటు వంశధార అధికారులు వచ్చి కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. నష్టం అంచనాలు వేశారు. వారం రోజుల్లో పనులు చేపడతామని చెప్పి వెళ్లారు. సంవత్సరాలు గడుస్తున్నా కోతకు గురైన ప్రాంతాన్ని శాశ్వతంగా పూడ్చిన దాఖలాలు లేవు. వంశధార నదికి వరదలు వచ్చినట్లయితే గట్టు మరింత కోతకు గురై అంతర రాష్ట్ర రహదారి అయిన హిరమండలం - పాతపట్నం ప్రధాన రహదారిపైకి వరద నీరు వచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు సమీపంలో ఉన్న సుభలాయ్, హిరమండలం,తదితర ప్రాంతాలు మునిగిపోయే అవకాశం ఉంది. అలాగే భగరధీపురం సమీపంలో గత మూడు సంవత్సరాల క్రితం సంభవించిన వరదలకు పూర్తిగా కోతకు గురైంది. దీంతో పాటు కొంత మంది రైతుల భూములు కూడా వంశధార నది గర్భంలో కలిసిపోయింది. దీంతో సంబంధిత గ్రామ రైతులు వరద గట్టును ఏర్పాటు చేసి మిగిలిన భూములను రక్షించాలని కోరుతున్నారు. ప్రమాదం జరగక మునుపు చర్యలు చేపట్టకుండా... ప్రమాదం జరిగిన తరువాత అధికారులు హడావుడే ఎక్కువని నదీతీర ప్రాంత ప్రజలు చెబుతున్నారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్పందించి ఈ సమస్యను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి వంశధార గట్టుకు పడిన కోతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

## 24 మందికి హెచ్‌సీగా పదోన్నతులు?

* త్వరలో ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో శిక్షణకు
* ఎస్పీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడమే తరువాయి

**శ్రీకాకుళం క్రైం, జులై 24 (వార్త):** జిల్లాలో పలువురు కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా ప్రమోషన్లు రానున్నాయి. సుమారు 24 మంది పేర్లతో ఓ జాబితా సిద్ధమైంది. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వద్ద ఈ ఫైల్ ఉంది. ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన వెంటనే పదోన్నతులు పొందిన కానిస్టేబుళ్లు మూడు వారాల పాటు ఒంగోలు పోలీసు ట్రైనింగ్ కళాశాలలో శిక్షణ పొందనున్నారు.

## నాటుసారా స్థావరాలపై సెబ్ దాడులు

## ఎక్కడికక్కడ పోలీసు తనిఖీ



లోపలి పేజీల్లో...

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం






## మహనీయుని సేవలు మరువలేనివి

**మెళియాపుట్టి జులై 24 (వార్త):** గ్రంథాలయాల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేసిన మహనీయుని సేవలు మరువలేనివని మెళియాపుట్టి గ్రంథాలయాధికారిణి అనురాధ అన్నారు. గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి సందర్భంగా బుధవారం ఆమె స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటరమణయ్య దేశానికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో నలంద పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు జె.హరినాథ్, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

# నాటుసారా స్థావరాలపై సెబ్ దాడులు

### * 1200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం * సారా అమ్మకాలపై సమాచారం ఇవ్వండి * సెబ్ సీఐ జైభీం

**మందస, జులై 24 (వార్త):** మందస మండలంలోని గిరిజన ప్రాంతాల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు నాటుసారా తయారీ కేంద్రాలపై బుధవారం దాడులు నిర్వహించారు. సెబ్ సీఐ ఆర్.జైభీం ఆధ్వర్యంలో కొండలోగాం పంచాయతీ పరిధిలో గల చాపరాయి ప్రాంతంలోని జీడితోటల్లో తనిఖీలు నిర్వహించారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ మాట్లాడుతూ గ్రామంలో నాటుసారా బట్టీలు నిర్వహిస్తున్నారనే కోణంలో విచారణ చేసి వారిపై కూడాతగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మందస మండలంలో నాటుసారాని పూర్తి స్థాయిలో నివారించడానికి నాటుసారా తయారీ, రవాణా గురించి గానీ, నాటుసారా అమ్మకాలను గురించి గాని 9440902358 నుంబరుకు తెలియజేయవలసిందిగా ఆయన కోరారు. నాటుసారా పై సమాచారం



అందించిన వారి వివరాలు అతి గోప్యంగా ఉంచబడతాయన్నారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్ఐ. చంద్రమోహన్, సిబ్బంది కాంతారావు, శాంతారావు పాల్గొన్నారు.



## 600 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం

మెళియాపుట్టి, జులై 24 (వార్త): బెల్లపు ఊటలు 600 లీటర్లు ధ్వంసం చేసినట్లు పలాస డీటీఎఫ్ సీఐ రామచంద్రకుమార్ తెలిపారు. బుధవారం దారిపేట గ్రామంలో డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలతో సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించమన్నారు. ఈ దాడుల్లో బెల్లం ఊటలతో పాటు 15లీటర్ల సారాని, ప్లాస్టిక్ డ్రమ్ములను సైతం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ గణేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి

### * జడ్పీటీసీ బుచ్చిబాబు * చౌర్లంగి పీహెచ్‌సీ తనిఖీ


**హిరమండలం, జులై 24 (వార్త):** సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు వైద్యులకు సూచించారు. బుధవారం చౌర్లంగి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. వైద్యాధికారి యశ్వంత్ మాట్లాడుతూ పీహెచ్‌సీలో సిబ్బంది కొరత ఉందన్నారు. దీనిపై జిల్లా స్థాయి అధికారుల సహకారంతో సమస్య పరిష్కరిస్తామని జడ్పీటీసీ హామీ ఇచ్చారు. ఆయన వెంట ధనుపురం సర్పంచ్ దారపు ఢిల్లేశ్వరరావు ఉన్నారు.



# కేంద్ర బడ్జెట్‌లో గిరిజనులకు అన్యాయం

### * ఆదివాసీ గిరిజన సంఘం

**మందస, జులై 24 (వార్త):** కేంద్ర బడ్జెట్లో ఆదివాసీలకు అన్యాయం జరిగిందని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఆరోపించారు. మందసలో బుధవారం వారు మాట్లాడుతూ రూ.13000 కోట్లు కేటాయించామని, గత బడ్జెట్ కన్నా 4.31 శాతం అధికమని కేంద్ర గిరిజన మంత్రి ప్రకటించడాన్ని అంకెల మాయ బడ్జెట్‌గా అభివర్ణించారు. కేంద్ర బడ్జెట్‌లో ఆదివాసీ జనాభ ప్రాతిపదికన కేటాయింపులు జరగలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. గత బడ్జెట్లో ఆదివాసీలకు జనజాతి అభియాన్ పథకంలో కేటాయించిన 24 వేల కోట్లు నిధులు విడుదల చేయలేదన్నారు. ఈ పథకాన్ని ప్రధాని మోదీ అల్లూరి సీతారామరాజు జిల్లా కొత్త బల్లుగుడ గ్రామంలో ప్రారంభించినా, నిధులు మాత్రం విడుదలకు నోచుకోలేదని వాపోయారు.దేశ వ్యాప్తంగా 64 వేల గ్రామాల్లోని 5 కోట్ల ఆదివాసీలకు ప్రధాన మంత్రి సమ్మాన్ యోజన లబ్ధి చేకూరుతుందని ఆర్భాటంగా ప్రకటించడం తమను మోసగించడమేనని విమర్శించారు. విభజన చట్టంలోని పోలవరం ప్రాజెక్టు, గిరిజన యూనివర్సిటీ , వెనకబడిన ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తారని ఆశించిన ఆదివాసీ ప్రజలకు నిరాశే ఎదురైందన్నారు. పోలవరం నిర్వాసితులు, వెనకబడిన ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి, విభజన హామీల అమలు కు కట్టుబడి ఉంటామని చెప్పారే తప్ప వాటికి నిధుల ప్రస్తావన లేదన్నారు. ఏటా 48 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బడ్జెట్లో ప్రకటిస్తూ.. మరోపక్క ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ తదితర చట్టబద్ధమైన హామీలు బడ్జెట్‌లో చోటు చేసుకోలేదన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.అప్పన్న, ఎస్.ధర్మారావు, మండల నాయకులు సవర గురునాథ్, సవర జయరాం, సవర బావన్న తదితరులు పాల్గొన్నారు.





## రవీంద్రభారతిలో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ వేడుక

**నరసన్నపేట, జులై24(వార్త):**నరసన్నపేట రవీంద్రభారతి పాఠశాలలో బుధవారం ఘనంగా ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ వేడుక జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎస్ఐ అసిరినాయుడు విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలను అందించారు. నాయకత్వ ప్రాముఖ్యత, నాయకత్వ లక్షణాలు, విశిష్టతను తెలియజేశారు. రవీంద్రభారతి విద్యాసంస్థల చైర్మన్ ఎంఎస్ మణి మాట్లాడుతూ విద్యార్థి నాయకులు చిత్తశు ద్ధి, అంకితభావం, శ్రేష్టత, నిబద్ధత వంటి ఉత్తమ లక్షణాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి ఎన్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 217 రద్దుపై హర్షం

**వజ్రపుకొత్తూరు, జులై 24 (వార్త):** గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 217 రద్దుపై మత్స్యకారుల నాయకుల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు హామీ ఇచ్చిన రాష్ట్ర మత్స్యశాఖా మంత్రి అచ్చెన్నాయుడుకు రుణపడి ఉంటామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల సంఘ నాయకులు సూరాడ మోహనరావు, కోడ రామన్న, అంబటి రామ కృష్ణ, గోవింద పాపారావు, సూరాడ దాసురాజు, కొండ అప్పారావు, ఆకుల పాపారావు, వంక రామారావు, గుల్ల చిన్నారావు, వంక శాంతారావు పాల్గొన్నారు.

## కాలువ నిర్వహణలో నిర్లక్ష్యం



**నరసన్నపేట, జులై24 (వార్త):** నరసన్నపేటలోని మారుతీనగర్ ఒకటి, రెండో వీధి మధ్యలో ఉన్న కాలువ పూర్తిగా శిథిలమై, రూపురేఖలు కోల్పోయింది. సుమారు 600 గృహాలకు ఉపయోగపడే ఈ కాలువ నిర్మించి సుమారు 50 ఏళ్లు కావస్తుంది. ఆనాటి నుంచి ఈ కాలువకు ఎటువంటి మరమ్మతులు చేపట్టక పోవడంతో, నీటి ప్రవాహం జరగక ఇక్కడి వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు వర్షాకాలం ప్రారంభమవ్వడంతో వర్షపు నీరు.. మురుగునీటితో పోటెత్తి , రోడ్డు మీద ప్రవహిస్తోంది. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధభరితంగా మారుతోంది. ఈ విషయం సర్పంచ్, పాలకవర్గం, ఈవో దృష్టికి తీసుకెళ్లినా చర్యలు చేపట్టలేదని ఆ వీధివాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని వారు కోరుతున్నారు.

## అభివృద్ధి పనులు పూర్తి చేయండి

**నరసన్నపేట, జులై 24 (వార్త):** తన నియోజకవర్గంలో పడకేసిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయాన్ని బుధవారం ఆయన శాసనసభలో ప్రస్తావించారు. తన హయాంలో సుమారు 50 శాతానికి పైగా పూర్తి చేసిన పనులను గత ప్రభుత్వం పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించిందని, శాలిహుండం దగ్గర బ్రిడ్జి కూడా పూర్తి చేయలేదన్నారు. ఈ పనులు త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని కోరారు.

## 'ఆధార్ ప్రత్యేక డ్రైవ్ వినియోగించుకోవాలి'

**నరసన్నపేట, జులై 24 (వార్త):** కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'ఆధార్ ప్రత్యేక డ్రైవ్ ను వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ సత్యనారాయణ సూచించారు. బుధవారం నరసన్నపేటలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులందరూ ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని కోరారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఎస్పీని కలిసిన అధికారులు

**శ్రీకాకుళం క్రైం, జులై 24 (వార్త):** జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కేవీ మహేశ్వర్‌రెడ్డిని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. విజిలెన్స్ ఎస్పీ ఎ.సురేష్ బాబు, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెంట్ సీహెచ్ తిరుపతి నాయుడు, ఏపీఎస్ఆర్టీసీ పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ రీజనల్ మేనేజర్ విజయ్ కుమార్, శ్రీకాకుళం ఒకటవ,రెండవ డిపో మేనేజర్లు మల్లికార్జున రాజు, శర్మ కలిసి పుష్ప గుచ్చాలను అందజేశారు. అలాగే రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్ సభ్యులు, ఆర్మీ ఎక్స్ సర్వీస్ మెన్ సంఘం సభ్యులు ఎస్పీని కలిశారు.






# ఎక్కడికక్కడ..



# పోలీస్ తనిఖీ



### * ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన * రూల్స్ పాటించని వారికి జరిమానా * జిల్లావ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్

**శ్రీకాకుళం క్రైం, జులై 24 (వార్త):** ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అధికారులు బుధవారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించనివారు, వాహన రికార్డులు, లైసెన్సు లేనివారికి అపరాధ రుసుం విధించారు. శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం, ఎస్ఐ సందీప్ కుమార్ సిబ్బందితో కలిసి వాహనచోదకులకు హెల్మెట్ ధారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు.







జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## 17వ వార్డులో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

**ఇచ్ఛాపురం, జులై 24 (వార్త):** మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇటీవలి వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కాలువలలో పూడిక తీత పనులు చేపట్టారు. శానిటేషన్ సిబ్బంది ఇన్స్పెక్టర్ ఉపేంద్ర కుమార్ పోరిడా ఆదేశాలతో శుభ్రం చేశారు. వార్డ్ ఇంఛార్జి జన్నెల సంతోష్ యాదవ్ పర్యవేక్షించారు.

# విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

**సరుబుజ్జిలి, జులై 24 (వార్త):** విద్యార్థులందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు అలవర్చుకోవాలని సరుబుజ్జిలి సబ్ ఇన్స్పెక్టర్ బి.నిహార్ అన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు తెలిసీ తెలియని వయసులో చెడు వ్యసనాలకు లోనవుతున్నారన్నారు. సిగరెట్‌తో ప్రారంభించి, తర్వాత ఆల్కహాల్, డ్రగ్స్‌కు కూడా అలవాటు పడుతున్నారని చెప్పారు. యువత చెడు మార్గంలో పడకుండా చక్కగా చదువుకొని ప్రయోజకులు కావాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ భూషణరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం, నిరోధించడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారి రమేష్ సాహు మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సహకారంతో విద్యార్థులకు అవగాహన కల్పించడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది జనార్ధనరావు,



అధ్యాపకులు నాగేంద్ర, ఆకెళ్ళ రామారావు, శ్రీనివాసరావు విజయ, వినోద్ రాజు, బోటనీ విజయ్ విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన నాక్ బృందం

**పాలకొండ, జులై 24 (వార్త):** పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అర్జెడీ శోభారాణి, నాక్ పేర్ బృందం బుధవారం సందర్శించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిశీలనకు వచ్చిన ఈ బృందానికి కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంబాబు, అధ్యాపకులు ఘన స్వాగతం పలికారు. ఉదయం 9 గంటలకు కళాశాలలో ప్రముఖ జానపద వేషధారణతో విద్యార్థులు స్వాగతం పలికారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కళాశాల పరిపాలన పరమైన విషయాలను వివరించారు. కళాశాలలో వివిధ విభాగాలైన క్యాంటీన్, లైబ్రరీ, గర్ల్స్ వెయిటింగ్ హాల్, మెడిసినల్ ప్లాంట్ లను సందర్శించారు. విరామ అనంతరము పేరెంట్స్ మీటింగ్ అల్యూమిని మీటింగ్, విద్యార్థులతో ముఖాముఖి తదితర కార్యక్రమాలు జరిగిందని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వపు విద్యార్థులు కళాశాల అభివృద్ధికి తోడ్పాటు నందించే పలువురు విద్యావంతులు హాజరయ్యారు.

## ఉపాధి దస్త్రాలు సిద్ధం చేయండి



**మెళియాపుట్టి, జులై 24 (వార్త):** జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీకి సమర్పించాల్సిన దస్త్రాలను సత్వరమే సిబ్బంది సిద్ధం చేయాలని ఉపాధి హామీ ఏపీవో తెంబూరు రవి, ఈసీ ఆదినారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఆయన మండలంలోని 37 పంచాయతీల దస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెలలో మండలంలో నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ చేస్తామన్నారు. కావున ఏ సమస్యలు రాకుండా పనిచేయాలన్నారు. సమావేశంలో ఏపీవో రవి, ఈసీ ఆదినారాయణరెడ్డి, సాంకేతిక, క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలి'



**నరసన్నపేట, జులై 24 (వార్త):** గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో రామకృష్ణారావు ఆదేశించారు. బుధవారం ఆయన నరసన్నపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛభారత్ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ ఉదయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ అప్డేట్ తప్పనిసరి

**ఆమదాలవలస, జులై 24 (వార్త):** ఆధార్ అప్డేట్‌కు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి డీఎల్‌డీవో వాసుదేవరావు కోరారు. బుధవారం ఆయన కృష్ణాపురం సచివాలయంలోని ఆధార్ నమోదు శిబిరాన్ని తనిఖీ చేశారు. నమోదు ప్రక్రియ మందకొడిగా సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలకు ఆధార్ తప్పనిసరి చేసిందని, అందరూ ఆధార్ నవీకరణ తప్పనిసరిగా చేసుకోవాలని కోరారు.

## అధ్వానంగా కొమ్ముువలస, గొట్టిపల్లి రహదారి

**ఎల్ఎన్‌పేట, జులై 24 (వార్త):** మండలంలోని మోదుగవలస జంక్షన్ నుంచి కొమ్ముువలస, గొట్టిపల్లికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. వర్షం పడితే రోడ్డుకు పడిన గోతుల్లో నీరు నిలిచిపోతోంది. దీంతో వాహనాలు ఈ గోతుల్లో దిగబడి ప్రమాదాలకు గురవుతున్నాయి. కనీసం ఈ రహదారిలో గోతులు పూడ్చాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.



## ఇది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే బడ్జెట్

**ఎల్ఎన్‌పేట, జులై 24 (వార్త):** ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా ఉందని బీజేపీ నేత సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. అమరావతి రాజధానికి రూ.15వేలు కోట్ల ఆర్థికసాయం, పోలవరం పూర్తికి హామీ, వెనుకబడిన జిల్లాలకు ఆర్థిక సాయం, మూలధన వ్యయం కోసం సాయం వంటివి ఏపీకి గొప్ప వరాలన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి ఈ బడ్జెట్ దోహదపడుతుందని తెలిపారు.

## బడ్జెట్ నిరాశాజనకం

**నరసన్నపేట, జులై 24 (వార్త):** కేంద్ర బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు తీవ్ర నిరాశ కలిగించిందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు, ప్రధాన కార్యదర్శి, బమ్మిడి శ్రీరామమూర్తి విమర్శించారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. పాత పెన్షన్ విధానం బడ్జెట్లో ప్రస్తావించకపోవడం అన్యాయమన్నారు. ఇన్‌కంటాక్స్‌కు సంబంధించి కొత్త విధానంలో పన్ను ఎక్కువగా చెల్లించాల్సి రావటం ఇబ్బందికరమన్నారు. విద్యా రంగానికి 6 శాతం కేటాయించాల్సి వుండగా, ప్రస్తుత బడ్జెట్లో కేవలం 3.25 శాతం నిధులు కేటాయించడం ఘోరమన్నారు. దీనిని సరిచేయాలని వారు కోరారు.

## కేంద్ర బడ్జెట్‌పై కొల్ల హర్షం

**బూర్జ, జులై 24 (వార్త):** కేంద్ర బడ్జెట్‌పై జనసేన పార్టీ శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం హర్షం వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యమైందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ఆర్థికాభివృద్ధికి, సమీకృత ఆర్థికాభివృద్దికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. పేద మధ్య తరగతి ప్రజలు, రైతులు, పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 3 కోట్ల అదనపు ఇళ్ల నిర్మాణం, ముద్ర రుణాలు, మహిళలు, బాలికలకు ప్రత్యేక బడ్జెట్, కొత్త ఉద్యోగులకు మూడు ప్రోత్సాహకాలు ఇలా అన్ని వర్గాలకు మేలు కలిగేలా బడ్జెట్ రూపకల్పన చేశారని కొనియాడారు.



## డిగ్రీ విద్యార్థులకు బొటనికల్ టూర్

**ఇచ్ఛాపురం, జులై 24(వార్త):** రత్తకన్న ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ థర్డ్ ఇయర్ ఐదవ సెమిస్టరు చదువుతున్న విద్యార్థులకు బోటనీ లెక్చరర్ బృందావనం బొటానికల్ ఫీల్డ్ ట్రిప్ నిర్వహించారు. ఇందులో భాగంగా పుట్టగొడుగులు పెరిగే పరిస్థితుల గురించి వివరించారు. విషపూరిత పుట్టగొడుగులకు, ఆహారంగా ఉపయోగపడే పుట్టగొడుగులకు మధ్య తేడాలను క్షేత్రస్థాయిలో తెలియజేశారు. ప్రిన్సిపాల్ డా.రబిన్ కుమార్ పాడి మాట్లాడుతూ పుట్టగొడుగులు మన ఆరోగ్యానికి మంచి ప్రోటీన్లు, విటమిన్స్ అందిస్తాయని, వర్షాకాలంలో ప్రకృతి సిద్ధంగా లభించే ఈ పుట్టగొడుగుల వల్ల ఆరోగ్యానికి మంచి ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు.

## రైతులకు సబ్సిడీపై ఎరువుల పంపిణీ




**సంతబొమ్మాళి, జులై 24 (వార్త):** మేఘవరం రైతు సేవ కేంద్రం వద్ద బుధవారం మరువాడ సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసురాజు రైతులకు సబ్సిడీ పై ఎరువులు బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా దాసురాజు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేఘవరం మాజీ సర్పంచ్ ప్రతినిధి పరపటి రాజశేఖర్ రెడ్డి, వ్యవసాయ సహాయకులు సుప్రియ, రైతులు, ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు మృతి



**జలుమూరు, జులై 24 (వార్త):** జలుమూరు హెడ్ కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతిపై ఎస్ఐ మధుసూదనరావు, నరసన్నపేట సీఐ ప్రసాదరావు, ఎస్ఐ అశోక్‌బాబు సంతాపం వ్యక్తం చేశారు. ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అసోసియేషన్ తరఫున డెత్ రిలీఫ్ ఫండ్ రూ.లక్ష ఆయన కుటుంబసభ్యులకు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కోశాధికారులు ఆర్.కృష్ణంనాయుడు, భుజంగరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న ఎంజీఆర్

**ఎల్ఎన్‌పేట, జులై24 (వార్త):** విజయవాడ కనకదుర్గమ్మను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం దర్శించుకుని పూజలు చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్ అనుచరులతో కలిసి దుర్గమ్మ సన్నిధికి వెళ్లి పూజలు నిర్వహించారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413